ప్రజాజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 16 | ఏప్రిల్ | 2024 | పేజీలు : 5



## భద్రాచలం రెండో వంతెనను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

*భద్రాచలం, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి*

భద్రాచలం వద్ద హై లెవల్ వంతెన ప్రారంభించుకోవడం చాలా సంతోషమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. సోమవారం భద్రాచలం వద్ద 98.45 కోట్లతో గోదావరిపై నిర్మించిన రెండో వంతెనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2.3 కిమి పొడవు కాగా

మిగతా 2 లో..





# భానుడి... భగ భగలు

- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు..
- కూలర్స్ ఏసీలకు పెరిగిన గిరాకీ..
- రోజు రోజుకు అడుగంటుతున్న జలాలు
- అల్లాడిపోతున్న ప్రజలు, పశుపక్ష్యాదులు..
- జోరందుకున్న శీతల పానీయాల విక్రయాలు..



2 లో

▪ భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాజ్యోతి

భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు అధికంగా పెరుగు తున్నాయి. పరిసర ప్రాంతాల గ్రామాలకు వేడి సెగలు తాకుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి... ప్రజలు, పశు పక్ష్యాదులు మంచినీటికి కటకటలాడుతున్నాయి.

## కళ్యాణ మహోత్సవ వేడుకలను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్

*భద్రాచలం, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి*

సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భద్రాచలానికి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. సోమవారం భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు జరుగనున్న మిథిలా స్టేడియంలో ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వైభవోపేతంగా ఎక్కడా లేని విధంగా సీతారాముల వారి కళ్యాణం జరిగేటువంటి పవిత్ర స్థలం మన భద్రాచలం పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ క్షేత్రంలో కొన్ని దశాబ్దాల తరబడి సీతారాముల వారి

మిగతా 2 లో..



## శ్రీ రామనవమి, పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు: ఎస్పీ రోహిత్



5 లో

# భానుడి... భగ భగలు

**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాజ్యోతి**

గత సంవత్సరం జిల్లాలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల వరకు చేరుకున్నాయి. ప్రస్తుతం 40 డిగ్రీలు చేరుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రానున్న మే, జూన్ నెలల్లో ఉష్ణోగ్రతలు ఏ విధంగా పెరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత, సెల్ఫోన్ రేడియేషన్ ద్వారా ఈసారి ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు భావిస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవు..**





ఈ వేసవి ఈసారి మరింత హాట్ గా మారనుంది. ఎండ తీవ్రత నుండి తట్టుకోవాలంటే తగిన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు గురి అవ్వకుండా ఉంటారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, బాలింతలు, వృద్ధులు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు బయటికి వస్తే ప్రమాదం. తప్పనిసరి బయటకు వెళ్లే ప్రజలు తలపై టోపీ లేదా గొడుగులు వాడాలని ఎండలో పనిచేసే కూలీలు తలపాగా చుట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్రిజ్ లోని నీటిని కాకుండా మట్టి కుండలో నీరు తాగడం వలన శరీరానికి చలువతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని సింగరేణి కార్మికుల పని వేళలు మార్పులు జరిపి కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మజ్జిగ ప్యాకెట్లను అందించాలని ప్రతి ఏట కార్మిక సంఘాలు కోరుతుంటారు. ఈసారి ముందుగానే ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున యాజమాన్యం ముందస్తుగా దృష్టిసారిస్తే బాగుంటుందని కార్మిక సంఘాలు నాయకులు కోరుతున్నారు.



**జోరందుకుంటున్న శీతల పానీయాల విక్రయాలు..**

ఎండల తీవ్రతతో శీతల పానీయాల విక్రయాలు పండ్ల రసాల గిరాకీలు భారీగా పెరుగుతున్నాయి. తోపుడు బండ్లనే జ్యూస్ పాయింట్ లుగా చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు దాహార్తికై జ్యూస్ పాయింట్ ఆశ్రయిస్తున్నారు. వీటితోపాటు శీతల పానీయాలు, కూల్ వాటర్ బాటిల్స్ కు ఒక్కసారిగా భారీ గిరాకీ పెరుగుతుంది. జిల్లా కేంద్రానికి వారి అవసరాల కోసం విచ్చేస్తున్న చుట్టుపక్కల ప్రజలు తమ దాహార్తిని తీర్చుకునేందుకు జ్యూస్ పాయింట్ నమ్ముకొని ఉపశమనం పొందుతున్నారు. అయితే ఇప్పటి నుండే పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, వచ్చే బాటసారులకు, గ్రామాల ప్రజలకు చల్లటి నీరును అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.





**పశు పక్ష్యాదులకు నీటి ఏర్పాటు.**

తీవ్రమైన ఎండలకు ప్రజలు ఎంతలా అల్లాడిపోతున్నారో... అదే విధంగా పశుపక్ష్యాదులు సైతం ఎండ వేడికి అల్లాడిపోతున్నాయి... జంతు ప్రేమికులు వాటి రక్షణ కోసం మంచి నీరు, ఆహారం ఏర్పాటు చేస్తూ కొంత ఉపశమనం కలిగిస్తున్నారు.

## భద్రాచలం రెండో వంతెనను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

(మొదటి పేజీ తరువాయి)



ఇందులో 1.25 కిమి పొడవు వంతెన, మిగిలినది అప్రోచ్ రహదారి ఉన్నట్లు తెలిపారు. 7.5 మీటర్లు వెడల్పు తో ఈ వంతెన నిర్మాణం జరిగినట్లు తెలిపారు. మొత్తం 37 స్లాబులతో వంతెన పూర్తి అయినట్లు తెలిపారు. శ్రీరామనవమికి భద్రాచలం విచ్చేయు భక్తులకు అదనపు వంతెన అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందని వంతెన పూర్తి తో రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు తెలిపారు. విజయవాడ నుండి జగదల్పూర్ వరకు ఉన్న రహదారిలో 166వ కిమి వద్ద ఈ వంతెన నిర్మాణం జరిగినట్లు తెలిపారు. 2014 సంవత్సరంలో ఈ వంతెన పనులు ప్రారంభం అయ్యాయని నేడు విజయవంతంగా పనులు ప్రారంభించుకున్నామని అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం మహెూత్సవాలకు భద్రాచలం విచ్చేయు భక్తులకు ఒకటే వంతెన ఉండటం వల్ల ప్రయాణికులు, భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు నుండి విముక్తి లభించిందన్నారు. పెండింగ్ ఉన్న పనులను కూడా సత్వరమే చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, ఐటిడిఎ పిఓ ప్రతీక్ జైన్, జాతీయ రహదారుల శాఖ ఈ ఈ యుగంధర్, డిఈ శైలజ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ మహోత్సవ వేడుకలను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్

(మొదటి పేజీ తరువాయి)



కళ్యాణం ఆనవాయితీగా జరుగుతున్నదని తెలిపారు. కళ్యాణ మహెూత్సవాన్ని ప్రత్యేకంగా కానీ పరోక్షంగా వీక్షించిన భక్తులకు ఎంతో పుణ్యం వస్తుందని వేదాల్లో చెప్పడం జరిగిందని అన్నారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మంచినీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు కళ్యాణ వేడుకలు వీక్షించేందుకు మొత్తం 24 సెక్టార్లు ఏర్పాటు తో పాటు ప్రతి సెక్టార్ లో ఎల్ ఈ డి టివిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణ వేడుకలకు విచ్చేయు భక్తుల సౌకర్యార్థం https://bhadradritemple.telangana.gov.inలో అందుబాటులో ఉన్నాయని భక్తులు టికెట్లు కొనుగోలు చేసుకో వచ్చని అన్నారు. స్వామి వారి కళ్యాణ వేడుకలు వీక్షించి జన్మ జన్మల పుణ్యా న్ని పొందాలని భక్తులకు ఆయన సూచించారు. ఈ కార్య క్రమంలో ఐటిడిఎ పిఓ ప్రతీక్ జైన్, దేవస్థానం ఈ ఓ రమాదేవి, ఏఈఓలు రవీందర్, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.





# వ్యర్థ ప్లాస్టిక్‌తో... అద్భుత కళాఖండాలు



- సృజనాత్మకత, తీరిక ఉండాలే గానీ ప్రతిదీ అద్భుతమే
- అంతర్జాలమే గురువుగా... ఇల్లే నందన వనంలా...
- నయా ట్రెండ్ బాటిల్ గార్డెన్స్

మనిసన్నాక కాస్తంత కళాపోషణ ఉండాలని అదేదో సినిమాలో అన్నట్లు కళాహృదయముండాలే గానీ ప్రతిదీ అద్భుత కళాఖండమై ఇల్లే ఒక నందనవనంలా మారిపోతుంది.. ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నారు మన పెద్దలు. ఆ ఇంటిని అలకంరించుకున్న తీరు చూస్తే ఆ ఇల్లాలి కళాహృదయం, అభిరుచి ఏపాటిదో ఇట్టే అర్థమైపోతుంది. అయితే ఇందుకు లక్షలాది రూపాయల ఖర్చు అవసరం లేకుండానే ఇంటిని ఇట్టే ఆకర్షవంతంగా తీర్చిదిద్దవచ్చని నేటి గృహిణులు నిరూపిస్తున్నారు. గృహిణుల సృజనాత్మకతకు కాస్తంత తీరిక తోడైతే అనేక కళాకృతులను ఆవిష్కరిస్తుంటారు. మనం ఎందుకూ పనికి రావని తీసేసే వస్తువులతోనే తిరిగి కళ్ళు చెదిరే గృహోపకర వస్తువులను తయారుచేసి చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంటారు. ఇందుకు వేలాది.. లక్షలాది రూపాయలు ఖర్చు అవసరం లేదండోయ్.. కాస్తంత కళాపోషణ ఉండాలి అంతే.. పనికిరాని ఇనప వస్తువులు, పనికిరాని సిడీలు, చెక్కేసిన పెన్సిల్ వేస్ట్, తాగేసిన కూల్‌డ్రింక్స్ బాటిల్స్, వాటి మూతలు, మంచినీరు తాగాక మనం ఎందుకూ పనికి రావనుకునే ప్లాస్టిక్ బాటిల్స్‌తో అద్భుత కళాఖండాలు రూపుదిద్దుకుంటాయని తెలుసా..

■ మణుగూరు, ప్రజాజ్యోతి

## ఆ... అనుభూతే వేరు...


తమ భాగస్వామి ప్రేమానురాగాలు పొందేం దుకు మహిళలు తమ సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. ఇందులో ప్రధానంగా మనం వేస్ట్ అనుకున్న వస్తువులే నేటి ఇంటి డెకరేషన్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. పైగా సొంతంగా తయారు చేసుకున్నామన్న అనుభూతిని మిగుల్చు తున్నాయి. ఇందుకోసం కాస్తంత తీరిక దొరికితే చాలు తమ సృజనాత్మకతకు పదునపెట్టేందుకు ఎక్కడ ఎటువంటి తరగతులు నిర్వహిస్తున్నారో తెలుసుకుని మరీ వెళ్ళి చేరిపోతున్నారు.

## ఎందుకూ పనికిరావనుకున్నవే....

మనం ప్రతి రోజూ ఏదో ఒక రూపంలో ప్లాస్టిక్ వస్తువులను కొనుగోలు చేస్తూనే ఉంటున్నాం. ఇందులో ముఖ్యంగా వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ బాటిల్స్, టిన్స్. ప్రధానమైనవి. ఇవి వాడాక వాటిని మనం పారేస్తుంటాం. కానీ అక్కడే ఒక కిటుకు ఉంది. వాటిని పారేయకండి. కాస్తంత మనసుపెట్టి ఆలోచించండి వాటిని ఉపయోగించి అద్భుతమైన కళాఖండాలను తయారుచేయవచ్చని గుర్తెరగండి. కళాఖండాలే కాదు నిత్యం మన విధినిర్వహణలోను, ఇంటి అవసరాల్లోను ముఖ్యమైన అవసరాలను తీర్చే వస్తువులుగా కూడా తయారుచేసుకోవచ్చు.


## మనసు దోచే ఎన్నో కళాకృతులు...

మనసుంటే మార్గం ఉంటుందని దానికి తోడు కాస్తంత కళాహృదయం తోడైతే చాలు మీ ఇల్లు ఇక నందనవనంలా మారి చూపరులను ఆకర్షించి వారి మనసును ఇట్టే దోచేయవచ్చు. కత్తెర, పిల్లలు బొమ్మలకు వేసే రంగులు, బ్రష్‌లు ఉంటే ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌తో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇంటిలో ఎన్నోరకాల షోలైట్లు, పెన్నుల స్టాండ్, గోడ గడియారాలు, మరెన్నో విధాలుగా పూలకుండీల తయారీ, అంతెందుకు బాటిల్ నుంచి సన్నని తీగ మాదిరిగా తీసి మగువలు చెవి రింగులుగా కూడా వాడుతున్నారంటే అతిశయోక్తి కాదు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో నివాస గృహాలను, పడవలను, సోఫాసెట్లను, టీపాయ్‌లను కూడా తయారు చేసి ఆనందిస్తున్నారు. మహిళలు వాడే హ్యాండ్ బ్యాగ్ నుంచి బాత్‌రూంలో బ్రష్‌లు పెట్టుకునే స్టాండ్, షవర్ వరకు, చార్జింగ్ పెట్టుకునే స్టాండ్ ఇలా ఎన్నో రకాలు వస్తువులు మనసుకు నచ్చేవిధంగా తయారుచేయవచ్చు.




























## నయా ట్రెండ్... బాటిల్ గార్డెన్...

ఇక ఇప్పుడు ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌తో గార్డెన్‌లను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్రెండ్ ఎక్కువగా నడుస్తుంది. ప్లాస్టిక్ బాటిల్స్‌ను కావలసిన విధంగా రంధ్రాలు ఏర్పాటు చేసుకుని వాటిని ప్రత్యేక డిజైన్స్ మాదిరిగా పేర్చి వాటిని వేలాడదీస్తున్నారు. వీటిలో కాస్తంత మట్టిని నింపి వాటిలో మొక్కలను పెట్టి వాటిని పెంపకమే పనిగా పెట్టుకున్నారు. అయితే చూపరులను ఇట్టే ఆకర్షించే ఈ విధానం అత్యంత తక్కువ ఖర్చుతోనే సాధ్యపడుతుంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినప్పటికీ గార్డెన్‌కి ఇంతటి సోయగం రాదంటే అతిశయోక్తి కాదు. ఇక ఇక్కడ చిత్రాలలో చూసారుగా మీరు కూడా ఇటువంటి కళాకృతులను తయారు చేసేందుకు సిద్ధం అవ్వండి మరి..

## అంతర్జాలమే గురువుగా...

ప్రజల అభిరుచికి తగ్గట్టుగానే సాంప్రదాయాన్ని ఆధునీకరించేలా ఆధునికతను మేళవించి ఠీవిని ఒలకబోసేలా ఇంటీరియల్ ఉత్పత్తులను సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువస్తుంది. వీటిని చూస్తూనే కొంతమంది ఇంటిని ఆకర్షణీయంగా మార్చేందుకు పోటీపడుతున్నారు. అంతర్జాలంలో చూసి కావలసిన వేస్ట్ మెటీరియల్ సమకూర్చుకుని పిల్లలు పాఠశాలలకు వెళ్ళిన సమయంలో ఖాళీ చేసుకుని అందమైన కళాకృతులను రూపొందించుకుంటున్నారు. ఏది ఏమైనా అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన క్రెడిట్ అంతా ఆ ఇంటి ఇల్లాలికే దక్కుతుందనుటలో సందేహం లేదు.



## నూతన హంగులు

నగర రూపురేఖలు ఎంతగా మారుతున్నాయో అదే విధంగా ప్రజలు జీవన శైలి కూడా రానురాను మారిపోతుందనుటలో సందేహం లేదు. దీంతో ధనికులతో పాటు మధ్యతరగతి ప్రజలు కూడా తమ ఇళ్ళకు నూతన హంగులు సమకూర్చు కోవటంలో పోటీపడుతున్నారు. ప్రధానంగా గృహావసరాలకు సంబంధించినంత వరకు మార్కెట్‌లోకి వస్తున్న నూతన వస్తువులను కోనుగోలు చేయటంలో లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారనుటలో సందేహం లేదు. ఇలాంటి తరుణంలో వేస్ట్ మెటీరియల్‌తో కళాకృతులు తయారు చేసుకుని ఇంటిని అలంకరించి తమ హుందాతనాన్ని పెంచుకుంటున్నారు.

# రాములోరి భక్తులకు పెరుగు అన్నం పంపిణీ



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి పాదయాత్రగా ఆంధ్రా నుంచి తెలంగాణ నుంచి వస్తున్న భక్తులకు300 పెరుగన్నం ప్యాకెట్లను ప్రముఖ సంఘ సేవకులు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బొల్లు సాంబశివరావు తన సొంత ఖర్చులతో సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అవధూత గుడి ఆశ్రమ వద్ద , సాయిబాబా గుడి వద్ద, బ్రహ్మంగారి గుడి వద్ద పెరుగన్నం పంపిణీ చేశారు. భక్తులకు పెరుగన్నం పంపిణీ చేయడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. పాదయాత్రగా వస్తున్న తమకు పెరుగన్నం పంపిణీ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సాంబ శివరావు మాట్లాడుతూ... భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణానికి పాదయాత్రగా వస్తున్న భక్తులకు పెరుగుఅన్నం అందించడం బాధ్యతగా భావించా నని ఎంతో సంతృప్తిగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు.

# పర్ణశాల బోటింగ్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి: కొండా చరణ్




**దుమ్ముగూడెం, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి**

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ భద్రాచలం డివిజన్ కమిటీ ముఖ్య సమావేశం ఈరోజు దుమ్ముగూడెం మండలం లక్ష్మీ నగరంలో జరిగింది. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి కొండ చరణ్ మాట్లాడుతూ.. దుమ్ము గూడెం మండలంలోని పర్ణశాల రాముల వారి గుడి ప్రాంగణంలో నడుపు తున్న బోటింగ్ నిర్వహణ ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చేదిగా ఉంది అని, నిరంతరం పర్యాటక కేంద్రంగా పర్ణశాలకు పుణ్యక్షేత్రమైన పర్ణశాలకు వందల వేల సంఖ్యలో ప్రజలు, రామ భక్తులు వస్తూ వెళ్తుంటారని, ఈ క్రమంలోనే బోటింగ్ ప్రయాణం చేసి ఉల్లాసం పొందుతారని అన్నారు. ఇక్క డ లాభాపేక్ష ఒక్కటే లక్ష్యంగా చూడడం సరైనది కాదని, ప్రజల రక్షణ చర్యలు కూడా సంబంధిత వారి బాధ్యత అని, అది అత్యంత అవసరమని అన్నారు. కానీ ఇక్కడ ఏమాత్రం రక్షణ చర్యలు తీసుకోకుండా సంఖ్యకి మించిన ప్రజలను ఎక్కించుకుంటూ, రక్షణ పరికరాలని ప్రజలకు ఇవ్వకుండా ఇష్టానుసారంగా బోటింగు నిర్వహిస్తున్నారు అని, గోదావరి మధ్యలోకి వెళ్లాక ఏదైనా జరగరానిది జరిగితే ప్రజల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరైనది కాదు అని అన్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతిగాంచిన పర్ణశాలకు ఈ బోటింగు నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఏ ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలు పకడ్బందీగా బోటింగ్ నిర్వహణ జరిగే స్థలంలో అమలు జరపాలని, ప్రజలకు రక్షణ చర్యల్లో భాగంగా అందించవలసిన అన్ని సౌకర్యాలు అందించాలని, అధికారుల పర్యవేక్షణలో ఈ బోటింగ్ నిర్వహణ జరగాలని కోరారు. లేని యెడల ఈ సమస్య పై పోరాటం చేస్తామని అన్నారు.



# శ్రీ రామనవమి, పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు: ఎస్పీ రోహిత్

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**

ఏప్రిల్ 17వ తారీకున భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, మిథిలా స్టేడియంలో జరగనున్న రామనవమి, మరుసటి రోజున జరగనున్న పట్టాభిషేకం ఉత్సవాలకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ సోమవారం భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది అందరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. సెక్టార్ల వారీగా ఇన్చార్జ్ అధికారులు తమ క్రింది స్థాయి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సుమారుగా 2000 మంది పోలీసులతో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలియజేసారు. భక్తుల కొరకు పార్కింగ్ స్థలాలు లడ్డూ కౌంటర్లు, సెక్టార్ల వివరాలను తెలియజేస్తూ జిల్లా పోలీసుల తరపున ప్రత్యేకంగా ఒక QR కోడ్ ను, అదేవిదంగా ఆన్లైన్ లింకు (https://bhadrachalam.netlify.app) ను రూపొందించడం జరిగిందని తెలిపారు. కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు.



# సుభాని కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి







**పాల్వంచ, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**

విజయవాడలోని బుక్ ఫెస్టివల్ హాల్ లో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్వంచ కు చెందిన కార్టూనిస్ట్ షేక్ సుభాని ప్రత్యేక జ్యూరి బహుమతి అందుకున్నారు. ఉగాది సందర్భంగా విశాఖ కు చెందిన విశాఖ కార్టూనిస్ట్ ఫోరమ్ కార్టూన్ పోటీని నిర్వహించింది. పోటీలో ఆంధ్రా, తెలంగాణ నుంచి దాదాపు 70 మంది కార్టూనిస్ట్ లు పాల్గొనగా ప్రీ వెడ్డింగ్ షూట్ గురించి సుభాని గీసిన కార్టూన్ పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విశాఖ కార్టూనిస్ట్ ఫోరమ్ సభ్యులు లాల్, టి.ఆర్.బాబు, రామశర్మ, ప్రముఖ కార్టూనిస్ట్ లు సరసి, బాచి, నాగిశెట్టి, మహిళ కార్టూనిస్ట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అగ్నిప్రమాదం - పూరి గుడిసెలు దగ్ధం





**భద్రాచలం, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**

భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డు నందు గల హీరో హొండా షోరూం ఎదురుగా ఉన్న తాటాకు గుడిసెలు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడం వలన పెద్ద ఎత్తున మంటలు చెలరేగి, అక్కడ ఉన్న తాటాకు ఇల్లులు పూర్తిగా దగ్ధమయ్యాయి.. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో భయభ్రాంతులకు లోనైనా ఆ ప్రాంతవాసులు ఇంట్లో నుంచి పరుగులు తీశారు..ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో పట్టణంలోని ప్రజలంతా పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో, ప్రాణనష్టం వాటిల్లకుండా అక్కడ నివసించే వారిని సురక్షితంగా బయటకు చేరవేశారు..విద్యుత్ శాఖ, అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందివ్వడంతో సమయానికి స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. బాధితులను పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.సోమవారం భద్రాచలంలో చర్ల రోడ్ ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఇళ్లలో షార్ట్ సర్క్యూట్ అయ్యి అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి వెళ్లి పరామర్శించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు . వారికి మనోధైర్యం ఇచ్చి అండగా ఉంటానని తెలియజేశారు.

# నేడే బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**ఇల్లందు, ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి:**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు మహబూబాబాద్ పార్లమెంటరీ ఇల్లందు నియోజకవర్గ పరిధిలోనీ ఇల్లందు మండలం, టేకులపల్లి, కామేపల్లి, ఇల్లెందు టౌన్ ముఖ్య నాయకుల ఎన్నికల సన్నాహక సమావేశం స్థానిక ఐతా ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా మహబూబాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి మహబూబాబాద్ పార్లమెంటరీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, తాత మధు, మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

